క్లుప్తంగా

నేడు జెర్రిమడుగులో గడప గడపకు

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం తొప్పాతి పల్లె పంచాయతీ జెర్రిమడుగు గ్రామంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొంటారని ఎంపీడీఓ రాఘవేంద్ర వర్మ తెలిపారు. ఉదయం 6.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అధికారులు, సచివాలయ సిబ్బంది విధిగా హాజరు కావాలని ఆయన తెలిపారు.

నేడు గడప గడపకు..

ఐరాల: మండలంలోని చిగరపల్లె సచివాలయ పరిధిలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఆదివారం మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పాల్గొంటారన్నారు.

నేడు కౌన్సిల్ సాధారణ సమావేశం

చిత్తూరు అర్బన్ : నగరపాలక సంస్థ కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు మేయర్ అముద, కమిషనర్ అరుణ పేర్కొన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి కార్పొరేటర్‌లు, ఎక్స్‌అఫిషియో సభ్యులు, కోఆప్షన్ సభ్యులు హాజరుకావాలని తెలిపారు.

బకాయిలు చెల్లించాలి

చిత్తూరు కలెక్టరేట్ : పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని ఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు రాఘవులు కోరారు. ఆదివారం సంఘం జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ డీఏ, జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాలన్నారు. ఈనెల 18న రాష్ట్ర స్థాయిలో జరగనున్న సంఘం ఎన్నికలకు జిల్లా నుంచి సభ్యులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. నాయకులు రఘు, మురళి, రమేష్, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ఎమ్మెల్యే ఆరణి



ఆలయం ముందు కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: తిరుమలలోని శ్రీవారిని ఆదివారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. టీడీడీ అధికారులు స్వాగతం పలికి ఎమ్మెల్యేకు దర్శన ఏర్పాటు చేశారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

బైక్‌ను ఢీకొన్న కారు



చికిత్స పొందుతున్న హరి

ఐరాల: బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తిని కారు ఢీకొనడంతో స్వల్ప గాయాలైన సంఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. వివరాలు .. ఐరువారంపల్లెకు చెందిన హరి (46) సొంత పనుల నిమిత్తం దివిటివారిపల్లెకు వెళ్తుండగా 35 యర్లంపల్లె సమీపంలో మలుపు వద్ద ఓ కారు ఢీకొంది. దీంతో హరి చేతికి స్వల్ప గాయం కావడంతో స్థానికులు ఐరాల పీహెచ్‌సీకి తరలించారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

గీతాముఖర్జీకి నివాళి

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం కమ్యూనిస్టు యోధ, మాజీ ఎంపీ గీతాముఖర్జీ శత జయంతిని నాయకులు నిర్వహించారు. ఆమె చిత్రపటానికి నివాళి అర్పించారు. మహిళ సమస్యల ఆమె చేసిన పోరాటాలు గుర్తుచేసుకున్నారు. నాయకులు నాగరాజన్, జమీలాబీ, విజయగౌరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇరుముడి ఉత్సవాలు

నగరి: పట్టణంలోని మేల్‌మరువత్తూర్ ఆదిపరాశక్తి ఆలయంలో ఆదివారం ఇరుముడి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. త్రిశూలానికి అమ్మవారి అలంకరణ చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కుంకుమార్చన పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

గుట్టలు కరిగి పోతున్నాయ్..



చిత్తూరు-గుడియాత్తం రహదారిలో హిటాచీతో కొండను తవ్వుతున్న దృశ్యం

యాదమరి మండల పరిధిలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. పట్ట పగలే టిప్పర్లలో, ట్రాక్టర్లలో మట్టి తరలిస్తున్నా పట్టించుకునే వారే లేక పోవడంతో అక్రమ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయల్లా సాగుతోంది. మండల స్థాయి అధికారులకు ఫిర్యాదులు అందుతున్నా అతీగతీ లేదు. మైన్స్ అధికారులు వాహనాలు సీజ్ చేసి కేసులు నమోదు చేస్తున్నారు.



దాసరాపల్లె వద్ద సీజ్ చేసిన మట్టి తరలింపు వాహనాలు

- యాదమరి మండలంలో రెచ్చి పోతున్న మట్టి మాఫియా
- పట్ట పగలే టిప్పర్లు, ట్రాక్టర్లలో తరలింపు
- పట్టించుకోని అధికారులు
- సీజ్ చేస్తున్న మైన్స్ అధికారులు

యాదమరి: మండల పరిధిలో అక్రమ మట్టి తరలింపు జోరుగా సాగుతోంది. మండలంలోని చిత్తూరు–గుడియాత్తం రహదారి ఆనుకుని తాణ వద్ద గుట్ట ప్రాంతంలో, కొటాల రహదారిలో దాసరాపల్లె, పలు గ్రామాల్లో, పెరుమాళ్ల పల్లె ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూముల్లో, కొనాపల్లె చెరువులో హిటాచ్, జేసీబీల సహాయంతో టిప్పర్లు, ట్రాక్టర్లతో మట్టిని తవ్వి తరలిస్తున్నారు. నిత్యం వందలాది వాహనాల్లో మట్టిని పట్ట పగలే విక్రయిస్తు అక్రమార్కులు జేబులు నింపుకుంటున్నారు. ఇటీవల భారీ వర్షాలకు పంట పొలాలలో మట్టి కొట్టుకు పోయింది. రైతులు పొలాలకు మట్టి తరలించుకుంటున్నారు. ఇటుక బట్టీల వారికి సైతం మట్టి అవసరం ఉండడంతో అక్రమార్కుల పంట పండుతోంది. రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం అందుతున్నా కిందిస్థాయి సిబ్బంది కొందరు సహకరిస్తుండడంతో అక్రమార్కులు గుట్టలు కరిగించేస్తున్నారని ఆయా గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

సీజ్ చేస్తున్న మైన్స్ అధికారులు

మండలఅధికారులు మట్టి అక్రమ విక్రయాలను అడ్డుకోక పోతుండడంతో ఆయా గ్రామస్తులు మైన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు అక్రమంగా మట్టిని తరలిస్తున్న జేసీబీ, రెండు ట్రాక్టర్‌లను ఇటీవల సీజ్ చేశారు. మండల పరిధిలో ఎక్కడైనా మట్టిని తరలిస్తుంటే సమాచారం ఇస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని మైన్స్ అధికారులు చెబుతున్నారు.

ఎవ్వరికీ అనుమతులు లేవు

యాదమరి మండల పరిధిలోని ప్రభుత్వ భూముల్లో మట్టి తరలింపునకు ఎవ్వరికీ అనుమతులు లేవు. ఎవరైనా మట్టిని టిప్పర్లలో, ట్రాక్టర్లలో తరలిస్తే సీజ్ చేసి కేసులు నమోదు చేస్తాం. సొంతానికి సైతం మట్టిని తరలించ కూడదు.

– చిట్టిబాబు, తహసీల్దార్, యాదమరి

నీవు లేవు..నీ పాట అజరామరం



పార్థసారథినాయుడుని సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు
- ఘనంగా ఘంటసాల శతజయంతి ఉత్సవాలు
- పలువురికి ఘన సన్మానం



కళాకారుల ప్రదర్శన

చిత్తూరు రూరల్: మూడు దశాబ్దాల పాటు దక్షిణాది రాష్ట్రాల సంగీత ప్రియులను తన గాన మాధుర్యంలో ఓలలాడించిన గాన గంధర్వుడు ఘంటసాల అని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి అన్నారు. చిత్తూరు నగరం టీటీడీ కల్యాణ మండపంలో ఆదివారం ఘంటసాల అభిమానుల సంఘం, బలిజ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. తొలుత కొందరు గాయకులు ఘంటసాల పాటలను ఆలపించి అలరించారు. అనంతరం ఆయన గీతాలకు నాట్యకారులు అద్భుతమైన నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడుతూ స్వాతంత్య్ర భావావేశంతో ఘంటసాల పాడిన పాటలు ఆనాడు ప్రజలకు ఉత్తేజపరిచాయన్నారు. తెలుగు రాష్ట్రమంతా మారుమోగాయని తెలిపారు. అగ్రనటులకు వందలాది పాటలు పాడిన ఘంటసాల.. దాదాపు ఏడువేల పాటలకు గానం చేశారన్నారు. గానమే కాకుండా 125 సినిమాలకు సంగీత దర్శకత్వం వహించిన ఘనత ఘంటసాలకే దక్కుతుందన్నారు. గాన గంధర్వుడు అమరలోకానికి తరలినప్పటికీ ఆయన పాడిన పాటలు నేటికీ అజరామరమని కొనియాడారు. చిత్తూరులో అభిమానులు శత జయంతి ఉత్సవం నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం పలువురిని ఘనంగా జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో ఘంటసాల అభిమాన సంఘం నాయకులు రవినాయుడు, కోడికిషోర్, పార్థసారథినాయుడు, రాజరత్నంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు కార్పొరేషన్‌లో స్పందన

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహిస్తున్నట్లు కమిషనర్ జె.అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు స్పందన ప్రారంభమవుతుందని, అధికారులు సమస్యల ఫిర్యాదులను స్వీకరిస్తారని పేర్కొన్నారు. నగరంలోని 50 డివిజన్లలోని వార్డు సచివాలయ కార్యాలయాల్లో కూడా మధ్యాహ్నం 3–5 గంటల మధ్యలో స్పందన జరుగుతుందని.. స్థానికంగా ఉన్న ప్రజలు ఆయా సచివాలయాల్లో వినతులు అందచేయవచ్చని తెలిపారు. ఇంటినుంచే కార్పొరేషన్ కాల్‌సెంటర్ ఫోన్ 08572232745, వాట్సప్ 9849907885 నంబర్లకు కూడా ప్రజలు సమస్యలు తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో ..

చిత్తూరు రూరల్: చిత్తూరు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పార్వతి తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజల నుంచి సమస్యల వినతులను స్వీకరిస్తామన్నారు. ప్రజలు సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకోరావచ్చని పేర్కొన్నారు.

వినాయకుని సన్నిధిలో పలువురు ప్రముఖులు



జమ్ముకశ్మీర్ న్యాయమూర్తికి తీర్థ ప్రసాదాలు అందిస్తున్న ఏఈఓ రవీంద్రబాబు



ఎమ్మెల్సీ అశోక్‌కుమార్‌కు తీర్థ ప్రసాదాలు అందిస్తున్న సూపరింటెండెంట్ కోదండపాణి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఉదయం జమ్ముకశ్మీర్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సందీప్ గందోత్రా, కర్ణాటక హైకోర్టు రిజిస్ట్రార్ రఘు, ఎమ్మెల్సీ అశోక్ బాబు ఆలయానికి విచ్చేయగా ఏఈఓ రవీంద్ర బాబు, సూపరింటెండెంట్ కోదండపాణి స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితులచే ఆశీర్వచనం చేయగా, అధికారులు తీర్థప్రసాదాలు అందించారు.

మొగిలీశ్వర స్వామిని దర్శించుకున్న కలెక్టర్

బంగారుపాళెం: మండలంలోని మొగిలి గ్రామంలో వెలసిన స్వయంభు శ్రీమొగిలీశ్వర స్వామి వారిని ఆదివారం జిల్లా కలెక్టర్ హరినారాయణ్ దర్శించుకున్నారు. కలెక్టర్‌కు దేవస్థానం ఈఓ మునిరాజు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. దర్శనానంతరం కలెక్టర్‌ను ఆలయ అర్చకులు ఆశీర్వదించి, తీర్థప్రసాదాలను అందజేశారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



అరగొండ బీసీ కాలనీలో భగవద్గీత పై ప్రచారం చేస్తున్న సభ్యులు

తవణంపల్లె: మండలంలోని అరగొండ బీసీ కాలనీల్లో ఆదివారం త్రైతసిద్ధాంత భగవద్గీత గ్రంథాలపై ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. భగవద్గీత సారాంశం ప్రకారం సంక్రాంతి అంటే గుణాలపై తిరుగుబాటు అని తెలిపారు. ఉత్తరాయణంలో మోక్షం పొందే అవకాశం ఉంది కాబట్టి అసలైన పండుగ సంక్రాంతి అని పేర్కొన్నారు. దక్షిణాయంలో చివరిరోజును భోగిపండుగ అంటారని అనేక జన్మల కర్మలను కాల్చుకుని యోగులు ఉత్తరాయణంలో మోక్షం పొందుతారని వివరించారు. కార్యక్రమంలో త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి అధ్యక్షుడు ధనుంజయ, సభ్యులు రాజేంద్ర, ధర్మేష్, మహీధర్, లలిత, చిట్టెమ్మ, కల్యాణి, శ్రావణి, నాగమ్మ, జ్ఞానావతి పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు



పుస్తకాలను చదువుతున్న విద్యార్థులు

గుడిపాల: గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని గుడిపాల శాఖా గ్రంథాలయాధికారి గజేంద్ర అన్నారు. ఆదివారం గ్రంథాలయంలో విద్యార్థులతో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ నాయకులు, స్ఫూర్తిదాయక నేతల జీవితచరిత్రలు, జనరల్‌నాలెడ్జ్, న్యూస్‌పేపర్‌లను చదవడం ద్వారా విజ్ఞానం పెరుగుతుందని తెలిపారు. గ్రంథాలయాల్లోని పుస్తకాలను చదివి ఎంతమంది ఉన్నతస్థానాలకు చేరుకున్న వారు ఉన్నారని పేర్కొన్నారు. సీఆర్‌పీ మల్లికార్జున్ పాల్గొన్నారు.

సత్యమ్మ దేవతకు అభిషేక పూజలు



పెరుమాళ్లపల్లెలో అమ్మవారి అభిషేకానికి జలాన్ని తీసుకెళుతున్న చిన్నారులు



సత్యమ్మ దేవత

బంగారుపాళెం: మండలంలోని పెరుమాళ్ళపల్లె, తుంబకుప్పం, తుంబపాళెం గ్రామాల్లో ఆదివారం గ్రామదేవత సత్యమ్మకు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని 101 బిందెల పవిత్ర జలాలతో అభిషేకించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సంక్రాంతి పండుగకు ముందు ఈ మూడు గ్రామాల్లో గ్రామస్తులు పెద్ద ఎత్తున సత్యమ్మతల్లికి పూజలు నిర్వహించడం ఆనవాయితీ అని గ్రామ పెద్దలు తెలిపారు.

మామిడికి మంచు, తెగుళ్ల దెబ్బ



మామిడి తోటను కప్పేసిన పొగ మంచు

గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో విపరీతమైన మంచు, పచ్చ పురుగు, ఆకుముడత తెగులు మామిడి పంటపై తీవ్ర ప్రభావం చూపుతోంది. వచ్చిన పూతను పచ్చపురుగు తినేస్తుండడంతో మామిడి రైతులు దిక్కుతోచన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. గతేడాది తక్కువ దిగుబడి దెబ్బ నుంచి కోలుకుందామని ఆశిస్తున్న రైతులు పంట రక్షణ చర్యలను ప్రారంభించారు.



తెగుళ్ల నివారణకు మందుల పిచికారీ



తిరుమలరాజపురం మామిడి తోటల్లో విరబూసిన పూత

పాలసముద్రం : గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో సుమారు 10 వేల ఎకరాల విస్తీర్ణంలో మామిడి తోటలున్నాయి. పాలసముద్రం మండలంలో ఆముదాల, బాలకృష్ణాపురం, వనదుర్గాపురం, గంగమ్మంబపురం, కేజేపురం, వెంగళరాజుపురం, తిరుమలరాజుపురం, శ్రీకావేరిరాజుపురం పంచాయతీల్లో మామిడి తోటలు విస్తారంగా ఉన్నాయి. డిసెంబర్ నుంచి పూత విరబూస్తోంది. ఈ సమయంలో పచ్చపురుగు, ఆకుముడత తెగులు ఆశించడంతో పూత వచ్చినట్టే పోతుంది. పచ్చరంగు పురుగులు పూతను తినేస్తున్నాయి. పూతను కాపాడుకునేందుకు రైతులు అనేక కష్టాలు పడుతు మందులు పిచికారీ చేస్తున్నారు. మంచు అధికంగా పడుతుండడంతో మామిడి పూత పింజ కాకుండా రాలిపోతోంది. మంచు పడే సమయంలో పూతను నాశనం చేసే పురుగుల దాడి ఎక్కువగా ఉంటుంది. సకాలంలో చర్యలు తీసుకోకపోతే మామిడి పంట పూర్తిగా నాశనం అవుతుందని, మామిడిని తెగుళ్లు ఆశిస్తున్నా సస్యరక్షణ చర్యలపై ఉద్యానవన శాఖాధికారు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని రైతులు పేర్కొంటున్నారు. ఏం మందులు వాడాలో తెలియక ఎరువుల వ్యాపారులు సూచించిన మందులు పిచికారీ చేస్తున్నామని చెబుతున్నారు.

నగరి రైల్వేస్టేషన్‌కు మహర్దశ

- రూ.8 కోట్లతో అభివృద్ధి
- అండర్ బ్రిడ్జి, ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు
- మంత్రి రోజా చొరవతో సకల వసతులు



గతంలో రైల్వేస్టేషన్ (ఫైల్)



ఓవర్ బ్రిడ్జితో ఆధునికీకరించిన నగరి రైల్వేస్టేషన్





నూతనంగా నిర్మించిన అండర్ బ్రిడ్జి

నగరి: ఒకప్పుడు స్టేషన్ మాస్టర్ గది మినహా ఎలాంటి సదుపాయాలు లేని నగరి రైల్వేస్టేషన్ నేడు రూపురేఖలు మారిపోయాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నాటి ఎమ్మెల్యే, నేటి మంత్రి ఆర్కేరోజా పార్టీ ఎంపీలతో కలిసి 2020 ఫిబ్రవరిలో అప్పటి కేంద్ర రైల్వే మంత్రి పియూష్‌గోయల్‌ను కలిసి రైల్వేస్టేషన్ అభివృద్ధిపై వినతి పత్రం అందజేశారు. దీంతో రైల్వేస్టేషన్‌కు మహర్దశ పట్టింది. రూ.5 కోట్లతో అండర్ బ్రిడ్జి, రూ.1.05 కోట్లతో ఫుట్ ఓవర్ పాత్, రూ.75 లక్షలతో ప్లాట్ ఫాం, ప్రయాణికులు కూర్చునే సిమెంటు కుర్చీలు, రూ.25 లక్షలతో ఎల్ఈడీ లైట్లు, రూ.20 లక్షలతో పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టం, రూ.20 లక్షలతో పే అండ్ యూజ్ మరుగుదొడ్లు, రూ.15 లక్షలతో సర్క్యులేటింగ్ ఏరియా అభివృద్ధి, రూ.15 లక్షలతో వెయిటింగ్ హాల్ నిర్మించారు. త్వరలో నాలుగో ప్లాట్ ఫాం పనులు ప్రారంభంకానున్నాయి.

నగరి – దిండివనం లైన్ పూర్తయి ఉంటే..

2006–07 బడ్జెట్‌లో ప్రతిపాదించిన నగరి–దిండివనం రైల్వేలైన్ పూర్తయి ఉంటే నగరి రైల్వేస్టేషన్ జంక్షన్‌గా మారేది. భూముల కేటాయింపులో జాప్యం, నిధుల విడుదల కాకపోవడం లాంటి పలు సమస్యలతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ మార్గం నగరి నుంచి చిత్తూరు, వేలూరు, తిరువళ్లూరు, తిరువణ్ణామలై జిల్లాలను కలుపుతూ 184 కిలోమీటర్లు ప్రయాణించి దిండివనం చేరుతుంది. 22 స్టేషన్లు, 3 జంక్షన్లు,13 క్రాసింగ్‌లు, 9 హాల్టులను కలుపుతుంది. రూ.582 కోట్లు కేటాయించిన ఈ ప్రాజెక్టు అంచనాల ప్రకారం 2020కే పూర్తవ్వాలి. రైల్వే లైన్‌కు భూములకు కేటాయింపు పనులు మన రాష్ట్రంలో పూర్తయ్యాయి. తమిళనాడు రాష్ట్రానికి సంబంధించి భూ సమస్యలు పరిష్కారం కావలసి ఉంది. అలాగే నిధుల విడుదల కాకపోవడంతో పనులు ప్రాథమిక దశలోనే ఉన్నాయి. ఇప్పటి వరకు 6 కిలోమీటర్ల మేరకే రైల్వేలైన్ పూర్తయింది. పనులు వేగవంతంపై పార్లమెంట్‌లో చర్చలు జరుగుతున్నాయి. అవి ఫలించి లైన్ పూర్తయితే నగరి రైల్వేస్టేషన్ జంక్షన్‌గా రూపుదిద్దుకుంటుంది. నగరి ప్రాంతంలో ఆగే రైళ్ల సంఖ్య కూడా పెరుగుతుంది.

మన సంస్కృతిని కాపాడుకుందాం



ఫరీద్‌బాబా దంపతులను కళా బంధువు పురస్కారంతో సత్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: మన ప్రాచీన జానపద సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని రచయితల సంఘం గౌరవాధ్యక్షుడు కట్టమంచి బాలకృష్ణారెడ్డి తెలిపారు. సంక్రాంతిని పురస్కరించుకొని టీటీడీ సహకారంతో, చింతగుంపల రాజేంద్రమ్మ, ఆనంద నాయుడు దంపతుల సౌజన్యంతో మన సంస్కృతి కళా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం జానపదం, సంస్కృతి, సంప్రదాయ కళారూపాలు, భక్తి భజన పాటల తోరణం కార్యక్రమాన్ని చేపట్టారు. దీనికి ఆయనతోపాటు ఎస్వీ సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సుధాకర్, ప్రజా ఉద్యమ నేత పి.అంజయ్య, ప్రముఖ కథ రచయిత్రి ఎంఆర్.అరుణకుమారి, గూడూరు ఆర్‌డీవో కిరణ్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. పల్లె జీవనానికి పట్టుకొమ్మలైన గొబ్బెమ్మ పాటలు, జానపద గీతాలు, పంబ వాయిద్య విన్యాసాలు అంతరించిపోతున్న కళారూపాలను నేటి తరానికి పరిచయం చేస్తూ ప్రదర్శన చేపట్టడం అభినందనీయమన్నారు. ఇటువంటి కళారూపాలను, కళాకారులను ప్రోత్సహించే దిశగా కళా సంస్థలు ముందుకు రావడం సంతోషకరమన్నారు. కళా రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న పలువురిని జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి అభినందించారు. కళాకారులను ప్రోత్సహిస్తూ కళాసేవలు అందిస్తున్న ఫరీద్‌బాబా దంపతులను కళాబంధువు పురస్కారంతో సత్కరించా రు. అనంతరం జానపద, భక్తి సంగీత కళాప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు తమ కళా ప్రతిభా పాటవాలను ప్రదర్శించి అలరింపజేశారు. బంగారుపాళెం పాండురంగ కళానాట్య మండలి వారు ప్రదర్శించిన ద్రౌపది వస్త్రాపహరణం నాటకం, కడప వారిచే ప్రదర్శించిన బ్రహ్మంగారి జీవిత చరిత్ర సభికులను మంత్రముగ్ధుల్ని చేసింది. ఈ కార్యక్రమంలో మన సంస్కృతి కళా సంస్థ గౌరవాధ్యక్షుడు గంగిరెడ్డి, అధ్యక్షుడు సహదేవనాయుడు, కార్యదర్శి కె.రెడ్డెప్ప, విశ్రాంత ప్రిన్సిపాల్ నారాయణస్వామి, హరినాయుడు, రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, ఆమూరి సుబ్రమణ్యం, ఎస్టీయూ రాష్ట్ర నాయకులు పురుషోత్తం నాయుడు, కలువగుంట రామమూర్తి, గొల్లా పిన్ని సుబ్రమణ్యం, అరసం కార్యదర్శి యువశ్రీ మురళి, రచయిత సురేంద్ర పాల్గొన్నారు.